క్లుప్తంగా

బైపాస్ బస్సు సర్వీసులు

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి నెల్లూరు సెక్టార్‌లో తిరిగే పలు బస్సు సర్వీసులను సంగం ఊర్లోకి వెళ్లకుండా బైపాస్ మీదుగా నడుపుతున్నట్లు డిపో మేనేజరు శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఉదయగిరి నుంచి నెల్లూరు వెళ్లే ఉదయం 6.30, 8.30, 11.30, మధ్యాహ్నం 1.30, 2.30 సాయంత్రం 5 గంటలకు, నెల్లూరు నుంచి ఉదయగిరికి వచ్చే ఉదయం 7.00, 7.45, 9.30,10.30,11.30, మధ్యాహ్నం 2.00, 3.30, సాయంత్రం 5 గంటలకు బస్సులు సంగం బైపాస్ మీదుగా వస్తాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గొబ్బెమ్మ గ్రామోత్సవం



మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో గొబ్బెమ్మ గ్రామోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి నెల ప్రారంభం నాటి నుంచి మహిళలు గొబ్బెమ్మలు ఆడి దాని ద్వారా వచ్చే నగదు, వంట సామగ్రితో చివరిరోజు గొబ్బెమ్మ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా చంద్రమౌళినగర్ పోలేరమ్మ రచ్చ, గొబ్బెమ్మ చావిడి, అరుంధతీయవాడ వద్ద గొబ్బెమ్మలను కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గొబ్బెమ్మలను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గొబ్బెమ్మను గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

కోవూరు: స్థానిక కొత్తూరులోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన పోటీల్లో రాణించి కోవూరు-1, కోవూరు-2, పడుగుపాడు-2, పోతిరెడ్డిపాళెం-1 సచివాలయ జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ జట్లకు శనివారం సెమీఫైనల్స్, ఫైనల్ పోటీలు జరుగుతాయని ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. ఉదయం 9 గంటలలోపు నాలుగు జట్ల క్రీడాకారులు క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. ఎంఈఓ రహీం, పీడీలు దేవిక, రమేష్‌బాబు, పీఈటీలు వెంకట సుబ్బమ్మ, అజయ్, జాన్సన్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

- **మనుబోలు:** క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి అన్నారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు శుక్రవారం పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. యువతీయువకులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. గ్రామీణ స్థాయిలో యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ క్రీడా పోటీలు ఎంతో దోహదపడ్డాయన్నారు. మండలంలో వివిధ క్రీడలకు సంబంధించి 192 పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు తిక్కవరపు వెంకటరమణారెడ్డి, అక్కంపేట సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌రెడ్డి, మనుబోలు ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, జెట్టి సురేంద్రరెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే ప్రారంభం



సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో కులగణన సర్వేను శుక్రవారం ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది తొలుత బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 28 వరకు కులగణన సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వే సందర్భంగా ఇళ్లలో లేని వారు ఫిబ్రవరి 5వ తేదీ వరకు సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించి వివరాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సుబ్బలక్ష్మి, వలంటీర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- **ఇందుకూరుపేట:** మండలంలో కులగణన సర్వేను శుక్రవారం ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు మాట్లాడుతూ కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన ప్రజలు



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మేయర్ తదితరులు



విజయవాడకు బయలుదేరిన మన ఎమ్మార్పీఎస్ నాయకులు

నెల్లూరు(బారకాసు): విజయవాడలో శుక్రవారం సాయంత్రం సామాజిక న్యాయ మహాశిల్పాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అంబేడ్కర్ అభిమానులు, ప్రజలు ఉదయం అధిక సంఖ్యలో తరలివెళ్లారు. వారి కోసం 28 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశాలతో ఆయా వాహనాలకు వివిధ సచివాలయాల కార్యదర్శులు ఇన్‌చార్జిలుగా వ్యవహరించారు. వాహనాలను మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నగరపాలక సంస్థ వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

నెల్లూరు(వేదాయపాళెం): విజయవాడకు దళిత, గిరిజన, ప్రజా సంఘాల నేతలు శుక్రవారం భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు మాదిగ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా బాబాసాహెబ్ విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. దళితుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో మన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పల్లాల సునీత, జిల్లా అధ్యక్షుడు కాకులూరు శ్రీనివాసులు, యూత్ అధ్యక్షుడు వనం కుమార్, రాష్ట్ర కార్యదర్శి సిద్ధవరపు పెంచలయ్య సర్వేపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు కాకులూరి శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

తరలిన పార్టీ శ్రేణులు

నెల్లూరు రూరల్: విజయవాడకు శుక్రవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు, దళిత నాయకులు బస్సులు, వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనలతో నగరపాలక సంస్థ పరిధిలోని 26 డివిజన్లు, రూరల్ మండలంలోని 18 పంచాయతీల నుంచి ఎంతో ఉత్సాహంగా సభకు పయనమయ్యారు.

దర్గా ప్రాంగణంలో ఆహ్లాదకర వాతావరణం



దర్గా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మేయర్

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని నగర మేయర్ పోట్లూరి స్రవంతి ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ యాకసిరి వాసంతి, ఇతర నాయకులతో కలిసి మేయర్ దర్గాను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ పనులను చేపట్టాలన్నారు. స్వర్ణాల చెరువులో గుర్రపుడెక్కను తొలగించి పచ్చదనాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రూరల్ నియోజకవర్గ ప్రజలకు విశేషంగా సేవలందిస్తున్న నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ఆశీర్వాదాలు ఉండాలని దర్గాలో ప్రార్థించారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి కాకాణి

నెల్లూరు(సెంట్రల్): వీపీఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం రాత్రి నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.బ్రహ్మేంద్ర, జాయింట్ సెక్రటరీ సాయిమహేష్, ట్రెజరీ కల్యాణి, హేమలత, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

22న సీతారామపురంలో విగ్రహాల ప్రతిష్ట



పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): అయోధ్య రామమందిరంలో సోమవారం జరిగే బాలరాముని ప్రాణప్రతిష్ట సందర్భంగా ధర్మ సింధూ ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో కోవూరు మండలంలోని సీతారామపురంలో సీతారామ లక్ష్మణ హనుమాన్ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సమితి నిర్వాహకులు ధన్వి శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని కిసాన్‌నగర్ రాజీవ్‌గాంధీ కాలనీలోని గోశాలలో శాస్త్రోక్తంగా శుక్రవారం అభిషేక, పూజాది కార్యక్రమాలను చేపట్టి విగ్రహాలను ఉత్సవంగా సీతారామపురానికి రామభక్తుల ఆధ్వర్యంలో తరలించారు. బాలత్రిపురసుందరి దేవి అనుగ్రహంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆ ఆలయ ధర్మకర్తలు శరత్‌రెడ్డి, విజయభరత్, శ్రీకృష్ణ ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సుబ్రహ్మణ్య స్వామి, సేవా సమితి, రామభక్త బృందం సభ్యులు రామ్‌ప్రసాద్, మహంకాళి వెంకటేష్, కంచర్ల మహేష్, వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ వాయిదా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈనెల 21వ తేదీన నిర్వహించ తలపెట్టిన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రెండో రాష్ట్ర మహాసభను అనివార్య కారణాలతో వాయిదా వేశామని ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుమన్, మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ ఈనెల 28వ తేదీన ఆదివారం నగరంలోని జెట్టి శేషారెడ్డి భవనంలో జరుగుతుందన్నారు.

వరి పొలాల పరిశీలన



నెల్లూరు రూరల్: రూరల్ మండలంలోని ములుముడి, దేవరపాళెం గ్రామాల్లో వరి పొలాలను శుక్రవారం ఏడీఏ శ్రీనివాసులు, రూరల్ ఏఓ నాగమోహన్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి సాగులో జింకు లోపం నివారించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిర్లక్ష్యం వహిస్తే పంట దిగుబడులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో వీఏఏలు అనూష, విష్ణు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



చెక్కును అందజేస్తున్న పీఓ

నెల్లూరు(వేదాయపాళెం): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడు దాసరి శ్రీనివాసులు మృతిచెందాడు. అతని కుటుంబానికి ఐటీడీఏ అధికారులు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కొండాయపాళెం గేటు సమీపంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.10 వేల చెక్కును పీఓ మందారాణి ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండల శివ మాట్లాడుతూ గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎరుకల సేవా సంఘం నేతలు పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురంలో ఖాదర్‌వలీ బాబా దర్గాలో శుక్రవారం రాత్రి 47వ గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మొదట బాబా గంధాన్ని, జెండాలను ఊరేగించి దర్గా వద్దకు తీసుకొచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు ప్రసాదాలు, గంధాన్ని అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు బీబీజాన్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

నరసింహకొండపై వేలం పాటలు



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని నరసింహకొండపై ఉన్న శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం వివిధ హక్కులకు సంబంధించి వేలం పాటలు నిర్వహించారు. వాహన పార్కింగ్, టోల్‌గేట్, కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయించుకునే హక్కుకు, తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం పాటలు జరిగాయి. రూ.51,74,499కు వేలం ఖరారైంది. మరికొన్నింటికి వేలం వాయిదా పడింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ మాట్లాడుతూ గతంలో కన్నా ఈ ఏడాది రూ.4,95,399 రాబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, ఆలయ పాలకమండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) సుబ్బరాజుకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో డైరెక్టర్‌ను కలిసిన నాయకులు పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా యూనియన్ ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యదర్శి సుమన్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని కోరారు. మీటర్ రీడర్స్‌కు కనీస వేతనం అందజేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కారుణ్య నియమకాలు చేపట్టాలన్నారు. సమస్యలను సీఎండీ, ఉన్నతాధికారులకు తెలియజేస్తానని డైరెక్టర్ హామీ ఇచ్చారు.

తాగునీటి సరఫరాకు ముమ్మరంగా పనులు

- నేడు పలు ప్రాంతాల్లో అంతరాయం



పదారుపల్లి వద్ద పనులు చేస్తున్న దృశ్యం

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు ఏపీ టిడ్కో గృహ సముదాయాలకు తాగునీరు సరఫరా చేసేందుకు పంపింగ్ మెయిన్‌పై పడారుపల్లి వద్ద ఇంటర్ కనెక్షన్ చేయాల్సి ఉంది. శనివారం పనులు చేపట్టనున్నారు. దీంతో 23, 24 డివిజన్లకు సంబంధించి పడారుపల్లి, సుందరయ్య కాలనీ, కనుపర్తిపాడు, హౌసింగ్‌బోర్డు, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుంది. తిరిగి 21వ తేదీన సరఫరా చేస్తారు. ప్రజలు సహకరించాలని ఇంజినీరింగ్ విభాగాధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ విరమణ



సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులు

నెల్లూరు(లీగల్): న్యాయవాదులు విధుల బహిష్కరణను విరమించారు. ఏపీ భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలంటూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారు నెల నుంచి కోర్టు విధులను బహిష్కరించారు. నెల్లూరులోని జిల్లా కోర్టు వద్ద ఉన్న బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. అధికశాతం మంది న్యాయవాదుల అభిప్రాయం మేరకు సోమవారం నుంచి విధులకు హాజరుకావాలని నిర్ణయించినట్లు ఆ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమా మహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్ తెలిపారు.

పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ

నెల్లూరు(బృందావనం): సామాజిక సేవలో భాగంగా కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ దగ్గర ఉన్న స్వతంత్ర పార్కులో శుక్రవారం 45 మంది పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ, 50 మందికి ఆర్థిక సహాయం చేసినట్లు ఆ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. ఏవీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అరిగెపూడి విజయకుమార్ సౌజన్యంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరవ రాయప్ప ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

26న 'పోలూరి' శతజయంతి ఉత్సవ సమావేశం

నెల్లూరు(బృందావనం): పద్య కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో (జూనియర్ ఆర్ఎల్ రెడ్డి భవనం) బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ శతజయంతి ఉత్సవ మూడో సమావేశం జరుగుతుందని నిర్వాహకులు వేదం రాధాకృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగే సమావేశంలో హనుమజ్జానకీరామశర్మ రచించిన త్రిపురా రహస్య జ్ఞానఖండసారము - బాలప్రియ వ్యాఖ్యాన సహితం గ్రంథంపై విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు కె.గిరిజాలక్ష్మి ఉపన్యసిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కళాత్మక అభినందనలు

నెల్లూరు(బృందావనం): విజయవాడలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించడంపై హరనాథపురానికి చెందిన కళాకారుడు, ఉపాధ్యాయుడు సోమా పద్మారత్నం కళాత్మకంగా అభినందనలు తెలిపారు. బాబాసాహెబ్ సూక్ష్మ చిత్రాలను క్యాండిల్స్‌పై తీర్చిదిద్ది ప్రకాశింపజేశారు. అలాగే ఆయన చిత్రాన్ని సీసాలో వేశారు. అంబేడ్కర్ బడుగుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డైకస్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫత్తేఖాన్‌పేట విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని నెల్లూరు టౌన్ ఆ శాఖ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. ఫత్తేఖాన్‌పేట, రైతుబజార్, పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని తెలియజేశారు.

బీవీ నగర్‌లో..

బీవీ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వెంకటాద్రి విద్యుత్ ఫీడర్‌లో ఏబీ స్విచ్‌లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా లెక్చరర్స్ కాలనీ, కింగ్స్ కోర్టు అవెన్యూ, మాగుంట లేఅవుట్, అన్నమయ్య సర్కిల్, పిచ్చిరెడ్డి కల్యాణ మండపం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాబాసాహెబ్‌కు సముచిత స్థానం



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న వీరి చలపతిరావు

కొడవలూరు: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. శుక్రవారం విజయవాడలో సామాజిక న్యాయ మహాశిల్పాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అంబేడ్కర్ అభిమానులు మూడు బస్సుల్లో తరలివెళ్లారు. నార్తురాజుపాళెంలో బస్సులను చలపతిరావు జెండా ఊపి కదిలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, ఎంఈఓ ఎస్.అంకయ్య, సర్పంచ్ బి.సుప్రియ, ఎంపీటీసీ ఎన్.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు జి.జాలయ్య, రాధాకృష్ణ, మండల రీసోర్స్ కో-ఆర్డినేటర్ వి.మనోజ్‌కుమార్, నాయకులు బండి పెంచలయ్య, బొచ్చు శ్రీనివాసులు, జి.సునీల్, అల్లం సత్యంయాదవ్, ఆర్.వేణు పాల్గొన్నారు.